నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 21 జూలై 2024 RANGAREDDY

## వీధి కుక్కల కట్టడికి జోనల్ స్థాయి కమిటీలు

**విస్తృత అవగాహన కార్యక్రమాలకు కార్యాచరణ**



సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ) : వీధి కుక్కల దాడులు.. వాటి వల్ల జరుగుతున్న మరణాలపై ప్రభుత్వం అప్రమత్తమైంది. పసిపిల్లల ప్రాణాలు పోతుండటంతో నివారణ చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో తగిన చర్యలకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ఈ మేరకు యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్-2023కు అనుగుణంగా పురపాలికల స్థాయిల్లోనూ కమిటీలు వేస్తున్నది. ఇందులో భాగంగానే జోనల్ స్థాయి కమిటీలను బలోపేతం చేసేందుకు జీహెచ్‌ఎంసీ సన్నద్ధమవుతున్నది. కమిటీ చైర్మన్‌గా సంబంధిత జోనల్ కమిషనర్, సభ్యులుగా డిప్యూటీ కమిషనర్లు, వెటర్నరీ అధికారులు, యానిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉండనున్నారు. కుక్కల విషయంలో చేయాల్సిన, చేయకూడని పనులపై విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీధి కుక్కల సంతతి పెరగకుండా సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను పెంచనున్నారు.






వికారాబాద్ : ఎరంపల్లిలో రుణమాఫీ కాకపోవడంపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

# కొర్రీ.. వర్రీ



- రేషన్‌కార్డు ప్రామాణికంగానే రుణమాఫీ అమలు!
- పాస్‌బుక్ ఆధారంగా అని ప్రకటించినా.. ఉత్తర్వులివ్వని సర్కార్
- ఫలితంగా అర్హులైనా అందని లబ్ధి.. కార్యాలయాలకు రైతుల పరుగులు
- రుణమాఫీ కాలేదంటూ అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- కంట్రోల్ రూమ్‌కు ఒక్క రోజులోనే 700 ఫోన్ కాల్స్
- డీఏవో, ఎంఏవో, ఏఈవోలకు వేల సంఖ్యలో వినతులు
- డీసీసీబీ, పీఏసీఎస్ బ్యాంకుల్లో పూర్తిగా గందరగోళం

వికారాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పెట్టి కొంతమందికే రుణమాఫీ చేయడంతో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీకాని రైతులందరూ వ్యవసాయ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. అర్హతలున్నా మాఫీ కాలేదని, వెంటనే పరిశీలించి తమకూ వర్తింపజేయాలని ఫిర్యాదు చేస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. శుక్రవారం ఒక్క రోజే 700 ఫోన్ కాల్స్ వచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇక జిల్లా, మండల, ఏఈవో కార్యాలయాల్లోని అధికారులకు ఫిర్యాదులు అందించేందుకు రైతులు క్యూ కట్టారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతోనే చాలామంది రైతులం రుణమాఫీకి దూరమయ్యామని.. అనవసర కొర్రీలు పెట్టి కాంగ్రెస్ సర్కార్ తమకు తీవ్ర నష్టం చేసిందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇక డీసీసీబీ, పీఏసీఎస్‌లలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. వీటిల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల్లో కనీసం సగం మందికి కూడా రుణాలు మాఫీ కాకపోవడం గమనార్హం.

### రేషన్ కార్డు లేనందుకే..

పట్టాదారు పాసుపుస్తకం ప్రామాణికంగానే రుణమాఫీ ప్రక్రియ చేపట్టామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ఆచరణలో అందుకు విరుద్ధంగా రుణమాఫీ జరిగినట్లు తెలుస్తున్నది. రైతుల వివవరాలను పరిశీలిస్తే రేషన్‌కార్డు ప్రామాణికంగానే ప్రక్రియ చేపట్టినట్లు స్పష్టమవుతున్నదని గ్రామాల్లో చర్చ జరుగుతున్నది. రేషన్ కార్డుల ఆధారంగానే ప్రభుత్వ లెక్కల ప్రకారం అర్హులుగా ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ సొమ్మును జమ చేసినట్లు రైతులు చెబుతున్నారు. పాసుపుస్తకం ఆధారంగా రుణాలను మాఫీ చేస్తామని ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ.. క్షేత్ర స్థాయిలో మాత్రం అది అమలుకాకపోవడం గమనార్హం.

### లక్షలోపు రుణం ఉన్న కుటుంబానికే..

కుటుంబ సభ్యులకు కలిపి మొత్తం రూ.లక్షలోపు ఉన్న రుణాలను మాత్రమే ప్రస్తుతం మాఫీ చేస్తున్నారు. ఒకవేళ కుటుంబ సభ్యులందరూ తీసుకున్న రుణం మొత్తం కలిపి రూ.లక్షకు మించితే ఆ రుణాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఉదాహరణకు నలుగురు కుటుంబ సభ్యులు వేర్వేరుగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉండి ఒక్కొక్కరు రూ.30 వేల చొప్పున రుణం తీసుకుంటే.. వారిని ఒకే యూనిట్‌గా పరిగణిస్తూ మొదటి విడతలో రుణమాఫీకి అనర్హులుగా గుర్తించి మాఫీ చేయలేదు. ఒకవేళ ప్రభుత్వం పాసుబుక్ ఆధారంగా ప్రక్రియ చేపడితే ఆ కుటుంబంలోని అందరికీ మొదటి విడతలోనే రుణమాఫీ కావాల్సి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకునే ఆలోచన ఉంటే.. ముందే రేషన్ కార్డులను జారీ చేసి రుణాలను మాఫీ చేయాల్సి ఉండేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రూ.2 లక్షలను ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పుడు విడతలవారీగా అని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డు లేకపోవడంతోనే రుణాలు మాఫీ కావడంలేదనే విషయం వ్యవసాయాధికారులకు స్పష్టంగా తెలిసినప్పటికీ.. రెండో, మూడో విడతలో మీ రుణాలు మాఫీ అవుతాయంటూ రైతులకు చెప్పి పంపిస్తున్నారు.

### ఉత్తర్వులు ఇవ్వనందుకేనా?

పట్టాదారు పాసుపుస్తకాన్ని పరిగణనలోకి తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి నోటి మాటగా చెప్పడమే తప్ప ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో అధికారులు రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ ప్రక్రియను చేపట్టినట్లు తెలుస్తున్నది. పట్టాదారు పాసుపుస్తకం ఉండి రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ సొమ్ము జమ కాకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూర్చుతున్నది. అంతేకాకుండా వ్యవసాయ కార్యాలయాలకు వచ్చే రైతుల ఆధార్‌కార్డు ఆధారంగా రుణమాఫీ పోర్టల్‌లో స్టేటస్‌ను పరిశీలిస్తే రేషన్‌కార్డు లేకపోవడంతోనే రుణమాఫీ కాలేదనే విషయం కనిపిస్తుండడం గమనార్హం.



వికారాబాద్‌లో ఫిర్యాదు చేస్తున్న రైతులు

# సొసైటీల్లో సగం మందికే..

**చేవెళ్ల నియోజకవర్గంలోని 8 పీఏసీఎస్‌లలో కలిపి 2359 మందికే రుణమాఫీ**

**షాద్‌నగర్ సెగ్మెంట్‌లో కేవలం 1, 131 మందికే.. ఆందోళనలో అన్నదాతలు**

షాబాద్/షాద్‌నగర్, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలు మాఫీ చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించినా.. తీరా కొంతమందికే ఇచ్చి తుస్సుమనిపించింది. అందులోనూ సొసైటీ(సహకార సంఘాల)ల్లో రుణాలు తీసుకున్న మొత్తం రైతులకు సగం మందికే మాఫీ చేయడంతో సదరు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆయా మండలాల్లోని సహకార సంఘాల బ్యాంకుల వద్ద రైతులు తమకు రుణమాఫీ వచ్చిందో లేదోనని అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో మొత్తం 8 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్) ఉన్నాయి. ఇందులో మొత్తం 4910 మంది రైతులు లక్ష లోపు రుణాలు తీసుకోగా.. కేవలం 2359 మందికి మాత్రమే రుణమాఫీ చేసింది. ఇంకా 2551 మంది రుణాలు మాఫీ కాకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ, చేగూరు, మేకగూడ, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కొత్తపేట పీఏసీఎస్‌లలో మొత్తం 2,392 మంది రైతులు లక్ష లోపు అప్పులు తీసుకోగా.. కేవలం 1131 మందికే రుణాలు మాఫీ అయ్యాయి. సగానికి పైగా రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించిన అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీని వర్తింపచేయాలని కోరుతున్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

## పథకాలు ప్రతి లబ్ధిదారుడికీ అందాలి

*వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్*

కొడంగల్, జూలై 20: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికీ అందేలా అధికారులు పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో ఆయన ఆకస్మికంగా పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ముందుగా మున్సిపల్ పరిధిలో పర్యటించిన కలెక్టర్ వడ్డెరగల్లీలో ఓ కుటుంబంతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్నారా.. గృహజ్యోతి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ వస్తున్నదా.. విద్యుత్తు జీరో బిల్లు వస్తున్నదా.. అని అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సబ్సిడీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని వీధుల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కడా కార్యాలయంలో ఇంజినీర్లతో సమావేశమై మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉజ్జయిని బోనాలు

సిటీబ్యూరో, జూలై 20 ( నమస్తే తెలంగాణ )/బేగంపేట : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించే మహిళల కోసం ప్రత్యేకంగా రెండు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే వీఐపీలకు ఒకటి.. సాధారణ భక్తులకు మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇదిలా ఉంటే జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఆర్టీసీ 175 ప్రత్యేక బస్సులను నడుపుతున్నది. అయితే ఏదైనా కారణంతో సర్వీసులు అందుబాటులో ఉండకపోతే భక్తులు 9959226154, 9959226160 నంబర్లను సంప్రదిస్తే తక్షణమే బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కాగా, ఆదివారం బోనాలు, సోమవారం రంగం (భవిష్యవాణి) అంబారీ ఊరేగింపు, మహా హారతి ఉంటుంది.

### ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఏర్పాట్లను శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ క్రమంలో దేవాలయంలో అమ్మవారికి మంత్రి పొన్నం ప్రభాకర్, యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ. లార్సన్ ప్రత్యేక పూజలు చేయడంతోపాటు మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించారు.



గండిపేట చెరువు నుంచి నగరానికి వచ్చే కాలువపై వెలసిన వ్యాపారకేంద్రాలు

**గండిపేట కాలువ కబ్జాలమయం**

# వాటా ఇచ్చుకో.. వ్యాపారం పెట్టుకో..

**ఎక్కడికక్కడ వ్యాపార కేంద్రాలు**

**వసూళ్ల మత్తులో జలమండలి**

మణికొండ, జూలై 20 : గండిపేట కాలువ(కాండూట్) కబ్జాలమయంగా మారడంతో ప్రమాదపుటంచున ఉన్నది. ఎక్కడపడితే అక్కడ వ్యాపార కేంద్రాలు వెలుస్తుండటంతో మురుగునీటితో కాండూట్ పూర్తిగా కలుషితమవుతున్నది. పరిరక్షించాల్సిన జలమండలి అధికారులు, సిబ్బంది కాసుల కోసం కబ్జాలను ప్రోత్సహించి.. నెలవారీ 'మామూళ్ల'కు తిలాపాపం తలాపిడికెడు అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. కోకాపేట నుంచి మణికొండ మున్సిపాలిటీ పరిధి వరకు ఉన్న గండిపేట కాలువ వ్యాపార కేంద్రాలకు అడ్డాగా మారింది. కాండూట్‌కు ఇరువైపులా వంద అడుగుల దూరం వరకు జీవో 111 అమల్లో ఉంటుందని జలమండలి అధికారులకు స్పష్టంగా తెలుసు.. అయినా.. చుట్టుపక్కల అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. ఇదికాదన్నట్టు కాలువపైనే పలు వ్యాపార కేంద్రాలకు స్థలాలను కేటాయించి.. కొందరు జలమండలి సిబ్బంది నెలవారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కాండూట్ పరిరక్షణ కోసం నియమించబడ్డ సిబ్బంది చిన్న వ్యాపార కేంద్రాలపై జులుం చూపుతూ ప్రతి నెలా ఒక్కో దుకాణానికి రూ.5 నుంచి 7 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ఇవ్వకపోతే కాండూట్‌పై దుకాణం పెట్టొద్దంటూ బెదిరిస్తారని వారు వాపోతున్నారు. ఇటీవల పుప్పాలగూడ బీఆర్సీ ఎదురుగా వెలసిన ఓ భవన నిర్మాణదారులు ఏకంగా కాండూట్‌పై టైల్స్ వేసి రహదారిని నిర్మించడంతో 'నమస్తే' దానిని వెలుగులోకి తీసుకొచ్చింది. అక్రమంగా ఏర్పాటు చేసిన టైల్స్, కాంక్రీట్‌ను తొలగించేందుకు జలమండలి సిబ్బంది అక్కడకు వెళ్తే.. ఓ ఉన్నతాధికారి ఫోన్‌చేసి.. సదరు బిల్డర్‌తో మంతనాలు జరుగుతున్నాయని, ఇప్పుడెందుకు తొలగించడం అంటూ క్షేత్రస్థాయి అధికారులకు తెలిపినట్లు తెలిసింది. రెండు రోజుల తర్వాత ఆ టైల్స్, కాంక్రీట్‌ను స్వయంగా సదరు బిల్డరే తొలగిస్తారంటూ స్థానిక అధికారులు తెలిపారు. కానీ నేటికీ ఆ అక్రమ దారి అలాగే కొనసాగుతున్నది. అంతేకాకుండా మరో భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం నిర్మిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రొటోకాల్‌కు తిలోదకాలు

## నిరసన తెలిపిన కార్పొరేటర్లు

**బడంగ్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు**

**సమావేశం వేదికపై కాంగ్రెస్ నేతలను కూర్చోబెట్టడంపై రగడ**

**బహిష్కరించిన బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు**



సంబంధం లేని కాంగ్రెస్ నాయకులు వేదిక పైన కూర్చున్న దృశ్యం

బడంగ్‌పేట, జూలై 20 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.37.23 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శనివారం మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. ప్రజాభవనం ముందు మొక్కలు నాటారు. అనంతరం మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నేతలను వేదికపై కూర్చోబెట్టడంతో రగడ మొదలైంది. అధికారిక కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ నేత నిరంజన్‌రెడ్డి, కందుకూరుకు చెందిన జంగారెడ్డి, దేపా భాస్కర్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నేతలను వేదికపైకి పిలిచారు. దీంతో కార్పొరేటర్ల పేర్లు పిలువకుండా కార్యక్రమానికి సంబంధం లేని వ్యక్తులను ఎలా పిలుస్తారంటూ.. బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి బీజేపీ, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో వాగ్వాదానికి దిగడమే కాకుండా.. ఇలానే చేస్తాం ఏమి చేసుకుంటారో చేసుకోమన్నారు. అయితే అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి కార్పొరేటర్లకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సమస్య జటిలమైంది. అభివృద్ధి పనుల కార్యక్రమానికి పిలిచి అవమానించడం ఏమిటని బీజేపీ, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఆరోపించారు. అనంతరం సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. కాగా, మంత్రి శ్రీధర్‌బాబు ముందే ఈ తతంగం అంతా జరగడంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఇంత గందరగోళం జరిగితే ఏం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు.

### ఉచిత ప్రయాణానికి ఆర్టీసీకి రూ. 300 కోట్లు చెల్లిస్తున్నాం..

సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణానికి రూ.300 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రాయితీపై గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. ఆగస్టులో రెండో దశ రుణమాఫీ చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా అభివృద్ధి పనులకు రూ.700 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి, ఆర్డీవో సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసులతో అణచివేస్తారా..

అభివృద్ధి పనుల కార్యక్రమంలో ప్రొటోకాల్ గురించి ప్రస్తావిస్తే.. పోలీసులతో అణచివేస్తారా అంటూ.. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, రామిడి కవితా రాంరెడ్డి, దీపికా శేఖర్ రెడ్డి, యాతం పవన్ యాదవ్, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలితాకృష్ణ, రోణి రమేశ్, శివకుమార్, పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ ఖలీల్ తదితరులు అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలోనే ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే ఎలా అని వారు ప్రశ్నించారు. కార్యక్రమానికి సంబంధం లేని వ్యక్తులను వేదికపైకి ఆహ్వానించి.. చివరకు కార్పొరేటర్లను ఎలా పిలుస్తారని మండిపడ్డారు. పోలీసులను పెట్టి బయటకు గెంటివేయడం ఏమిటన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే లేకుండా అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.



సభను బహిష్కరించి వెళ్లిపోతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు